క్లుప్తంగా

ఆలయాల నిర్మాణానికి భూమి పూజ



దుర్గమాంబ ఆలయ నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న సర్పంచ్ దేవివెంకటరమణ

పరవాడ: మండలంలోని తానాం గ్రామంలో శ్రీ దుర్గమాంబ, శ్రీ మరిడిమాంబ ఆలయాల నిర్మాణానికి సర్పంచ్ కన్నూరు దేవి వెంకటరమణ, గ్రామ పెద్ద పైల కృష్ణారావు దంపతులు ఆదివారం భూమి పూజ చేశారు. దాతలు సహకారంతో సమకూర్చిన సుమారు రూ.45 లక్షల వ్యయంతో ఈ రెండు ఆలయాలు నిర్మించడానికి సన్నాహాలు చేస్తున్నామని సర్పంచ్ కన్నూరు దేవి వెంకటరమణ చెప్పారు.

అన్నప్రసాద పథకానికి రూ.లక్ష విరాళం



దాతకు బాండ్ అందజేస్తున్న సూపరింటెండెంట్ సునీల్

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి శాశ్వత అన్నప్రసాద పథకానికి ఆదివారం నగరానికి చెందిన కె.కుమార్ దంపతులు లక్ష 116 రూపాయల విరాళం అందజేశారు. అలాగే స్వామి, అమ్మవార్లకు పట్టువస్త్రాలు సమర్పించారు. దేవస్థానం తరఫున సూపరింటెండెంట్ అన్నప్రసాద పథకం బాండ్ దాతకు అందజేశారు.

అమల్లో 144వ సెక్షన్

పరవాడ: మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రిమాండ్ నేపథ్యంలో మండలంలో 144వ సెక్షన్ అమల్లో ఉందని సీఐ పి.ఈశ్వరరావు చెప్పారు. 30 పోలీస్ యాక్ట్ అమల్లో ఉన్న నేపథ్యంలో సభలు, సమావేశాలు, నిరసనలు, సంబరాలు వంటివి నిషేధమని చెప్పారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని సీఐ ఈశ్వరరావు తెలిపారు.

నేడు డయల్ యువర్ ఆర్‌డీవో కార్యక్రమం

మహారాణిపేట : సోమవారం విశాఖ రెవెన్యూ డివిజనల్ అధికారి డి.హుస్సేన్ సాహెబ్ డయల్ యువర్ ఆర్‌డీవో కార్యక్రమం నిర్వహించనున్నారు. ప్రతి సోమవారం ఉదయం 9.30 గంటల నుంచి 10.30 గంటల వరకు జరిగే ఈ కార్యక్రమంలో గాజువాక, పెదగంట్యాడ, పెందుర్తి, మహారాణిపేట, ములగాడ, గోపాలపట్నం తదితర ప్రాంతాలకు చెందిన తహసీల్దార్లు పాల్గొననున్నారు. ఈ సందర్భంగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం దిశగా చర్యలు తీసుకోనున్నారు. 0891-2562977 నంబర్‌కు ఫోన్ చేసి ప్రజలు సమస్యలు తెలియజేయవచ్చు. ఈ అవకాశాన్ని ప్రజలంతా వినియోగించుకోవాలని అధికారులు కోరారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు సత్కారం



అవార్డులు పొందిన ఉపాధ్యాయులతో ఆచార్య జి.ఎస్.ఎన్.రాజు, బాలమోహన్‌దాస్

సీతంపేట: బాలవికాస్ ఫౌండేషన్, గాంధీ సెంటర్ సంయుక్తంగా జాతీయ, రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయులుగా అవార్డులు పొందిన నలుగురిని సత్కరించారు. డాక్టర్ లంకపల్లి బుల్లయ్య కళాశాలలోని గాంధీ సెంటర్‌లో ఆదివారం ఈ కార్యక్రమం నిర్వహించారు. జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు పొందిన మురహరిరావు ఉమాగాంధీ, రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు పొందిన కె.వి.ఎస్.సుబ్రహ్మణ్యేశ్వరరావు, కొట్టాన రాంబాబు, విజయ్ సుశీల్ కుమార్‌లను ముఖ్య అతిథి సెంచూరియన్ యూనివర్సిటీ వీసీ ఆచార్య జి.ఎస్.ఎన్.రాజు చేతుల మీదుగా సత్కరించారు. గాంధీ సెంటర్ అధ్యక్షుడు ఆచార్య వి.బాలమోహన్‌దాస్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో బాలవికాస్ ఫౌండేషన్ కార్యదర్శి నరవ ప్రకాశరావు, డాక్టర్ బి.రామారావు, ఉపాధ్యాయుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

ఆశల ఖరీఫ్

- వర్షాలు కురవడంతో నాట్లు వేస్తున్న రైతులు



తవ్వవానిపాలెంలో వరి నాట్లు వేస్తున్న కూలీలు



మర్రిపాలెం సమీపంలో పూర్తికావచ్చిన వరి నాట్లు

సబ్బవరం: నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలతో అన్నదాతల్లో ఖరీఫ్ ఆశలు చిగురించాయి. వరి పంటపై ఆశలు పెట్టుకున్నారు. ఎప్పుడూ లేని విధంగా ఈ సంవత్సరం జూలై,ఆగస్టు నెలల్లో తీవ్ర ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. వరి నాట్లు వేసుకునే సమయంలో వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయి. ప్రస్తుతం మండలంలో మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు రైతులు వరినాట్లు వేసుకునే పనుల్లో నిమగ్నమయ్యారు.

ఇదీ పరిస్థితి

మండలంలో దాదాపుగా 3400 ఎకరాల్లో వరి పంట సాగు చేయాల్సి ఉంది. ప్రస్తుత వర్షాల వల్ల చెరువులు మోస్తరుగా నిండడంతో పాటు మడుల్లో నీరు చేరడంతో దాదాపు 2100 ఎకరాల వరకు వరి నాట్లు పూర్తి చేశారు. మరి కొన్ని గ్రామాల్లో ఉభాలు వేస్తున్నారు. ముదురిన నారుతో నాట్లు వేయడంతో దిగుబడులు తగ్గుతాయని రైతులు వాపోతున్నారు. ఈ సమయంలో పంటకు చీడపీడల బెడద కూడా ఉంటుందని.. అయినా ఆశలు వదులు కోలేక ఉభాలు వేస్తున్నామని రైతులు చెబుతున్నారు.

నాట్లు వేసేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు



రైతులు కొన్నిచోట్ల ముదురునారు ఉపయోగిస్తున్నారు. అటువంటి సమయంలో కుదురులో ఎక్కువ మొక్కలు ఉండేటట్లు చూసుకోవాలి. దగ్గరగా దగ్గరగా నాట్లు వేసుకోవాలి. వరి నాట్లు వేసుకునేటప్పుడే తప్పనిసరిగా కాలిబాటలు తూర్పు పడమరగా ప్రతి మూడు మీటర్లకు 20 సెంటీ మీటర్లు చొప్పున తీసుకోవాలి. భూమిలో జింక్ లోపం నివారణకు ఎకరాకు 20 కేజీల చొప్పున జింక్ సల్ఫేట్ వేసుకోవాలి. విచక్షణారహితంగా ఎరువులు వేయకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలి. ముందుగా నాట్లు వేసిన పొలాల్లో కొన్నిచోట్ల పొడ తెగులు గుర్తించాం. దీని నివారణకు హెగ్జా కొనజోల్ 2 మిల్లీ లీటర్లు/లీటర్ చొప్పున 200 లీటర్ల ద్రావణాన్ని తయారు చేసుకొని పిచికారీ చేయాలి.

– పోతల. సత్యనారాయణ, ఏవో, సబ్బవరం

సింహగిరి.. ఆధ్యాత్మిక ఝురి



తలంబ్రాలు ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు



కల్యాణంలో పాల్గొన్న భక్తులు



గరుడసేవ నిర్వహిస్తున్న అర్చకుడు

- విశేషంగా ఏకాదశి పూజలు



స్వర్ణ తులసీదళాలతో ప్రదక్షిణ చేస్తున్న అర్చకుడు, భక్తులు,

సింహాచలం: ఏకాదశి పురస్కరించుకుని ఆదివారం సింహగిరి భక్తులు పోటెత్తారు. గిరిపై ఎక్కడ చూసినా ఆధ్యాత్మిక సందడి కనిపించింది. అప్పన్నకు ఆర్జిత సేవలు వైభవంగా జరిపారు. ఉదయం 7 నుంచి స్వర్ణతులసీ దళార్చన ఘనంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను ఆలయ కల్యాణమండపంలోని వేదికపై అధిష్టంపజేశారు. అష్టోత్తర శత నామావళిపూజ నిర్వహిస్తూ 108 స్వర్ణతులసీ దళాలతో అర్చన చేశారు. ఆలయ సూపరింటెండెంట్ సునీల్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

విశేషంగా నిత్య కల్యాణం

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. ఉదయం 9.30 గంటల నుంచి ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయ కల్యాణమండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్టంపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం కమనీయంగా నిర్వహించారు.

వైభవంగా గరుడసేవ

శ్రీ వరాహ లక్ష్మీనృసంహస్వామికి గరుడసేవ వైభవంగా జరిగింది. స్వామివారి ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని వెండి గరుడవాహనంపై అధిష్ఠంపజేశారు. అష్టోత్తరశతనామావళి పూజ నిర్వహించారు. భక్తులను గరుడవాహనం చుట్టూ ప్రదక్షిణ చేయించారు. విశేషంగా హారతులు అందజేశారు.

ఉక్కు కార్మికుల పోరాట శక్తికి ఎదురుండదు



941వ రోజు దీక్షలో పాల్గొన్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: ఉక్కు కార్మికులు తమ భవిష్యత్తు కోసం చేస్తున్న పోరాటానికి ఎదురుండదని, ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ విషయంలో కేంద్ర ప్రభుత్వం దిగిరాక తప్పదని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు ధీమా వ్యక్తం చేశారు. ఈ మేరకు ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద చేపడుతున్న రిలే నిరాహార దీక్షలు ఆదివారం నాటికి 941వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షలో ఐఎన్‌టీయూసీ ప్రతినిధులు, సంస్థకు చెందిన పలువురు కార్మికులు పాల్గొని కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కార్మికులకు, భూనిర్వాసితులకు అండగా ఉన్న విశాఖ ఉక్కును కేంద్ర ప్రభుత్వం ప్రైవేట్‌పరం చేస్తామంటూ ప్రకటనలు చేయడం సరికాదన్నారు. విశాఖ ఉక్కును ప్రభుత్వరంగంలోనే కొనసాగించాలని దేశ ప్రజలు, కార్మికవర్గం మరి ముఖ్యంగా సంస్థకు భూములిచ్చిన నిర్వాసితులు గట్టి పట్టుదలతో ఉన్నారని, కనుక కేంద్ర ప్రభుత్వం చేసే ప్రకటనలతో బెదిరేదిలేదన్నారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం తన ఆలోచనను వెనక్కి తీసుకోవాలని, లేనిపక్షంలో ప్రత్యక్ష ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని హిజ్రా మృతి



హిజ్రా మృత దేహం

అక్కిరెడ్డిపాలెం: గాజువాక 60 అడుగుల రోడ్డులోని జీవీఎంసీ సులభ్ కాంప్లెక్స్ వద్ద ఆదివారం ఉదయం గుర్తు తెలియని హిజ్రా మృతదేహాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న గాజువాక ఎస్ఐ కొల్లి సతీష్ వివరాలు సేకరించారు. మృతి చెందిన హిజ్రా వయస్సు 30–35 ఏళ్లు ఉంటుందని, పసుపు రంగు టాప్, నీలం రంగు ఫ్యాంటు ధరించాడని తెలిపారు. హిజ్రా చేతిపై ఐ లవ్ యూ రాజు, ఐ లవ్ యూ నరేష్ అనే టాటూలు ఉన్నాయని తెలిపారు. ఎస్ఐ సతీష్ ఆదేశాల మేరకు గాజువాక యూనిట్‌కు చెందిన జయహో మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఉచితంగా సమకూర్చిన శాంతి రథం ద్వారా హిజ్రాను కేజీహెచ్ మార్చురీకు తరలించారు. హిజ్రాను గుర్తించిన వారు గాజువాక పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని కోరారు.

నిరుపేదలకు సేవలందించడం అభినందనీయం



సన్నీని సన్మానిస్తున్న మాజీ డిప్యూటీ మేయర్ దాడి సత్యనారాయణ

దాబాగార్డెన్స్ : నిరుపేదలకు సేవలందించటం అభినందనీయమని మాజీ డిప్యూటీ మేయర్ దాడి సత్యనారాయణ పేర్కొన్నారు. మొర్ర చిన్నమ్మ మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా నిరాశ్రయులకు సేవలందిస్తున్న ట్రస్ట్ చైర్మన్ మొర్ర సన్యాసిరావు (సన్నీ)ని ప్రశంస దీపిక కల్చరల్ అండ్ సోషల్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆదివారం నగరంలోని ఓ ప్రైవేట్ హాల్లో ఘనంగా సత్కరించింది. కార్యక్రమంలో పాల్గొన్న దాడి సత్యనారాయణ మాట్లాడుతూ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ వద్ద పని చేస్తూ నిరుపేదలకు తన వంతు సాయంగా సేవలందించడం గొప్ప విషయమన్నారు. కార్యక్రమంలో లివింగ్ స్టన్ ట్రస్ట్ సభ్యుడు నరేంద్ర కుమార్, ప్రకాష్, మా ఉపాధ్యక్షుడు, సినీ నటుడు రవితేజ, మాదాబత్తుల రమేష్, గోపాలకృష్ణ, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

అలరించిన సినీ సంగీత విభావరి

సీతంపేట: ఎల్ఎఫ్‌సీ మ్యూజికల్ ఫ్యామిలీ బ్యానర్‌పై ఆదివారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో జరిగిన సినీ సంగీత విభావరి ఆహుతులను అలరించింది. గాయనీ గాయకులు కరకవలస భాస్కర్, కె.అరుంధతి, కుమారి, జోషిత, సాత్విక ఆలపించిన సినీ గీతాలు ప్రేక్షకులను ఉర్రూతలూగించాయి. కార్యక్రమంలో దర్శకులు రెడ్నం యాదకుమార్, జి.వి.త్రినాథ్, గిన్నిస్ రికార్డు హోల్డర్ కోరుకొండ రంగారావు పాల్గొన్నారు.

సహజ యోగాతో సుఖమయమైన జీవితం



సహజ యోగ మందిరం పూజలు చేస్తున్న సహజ యోగులు

దాబాగార్డెన్స్ : ప్రతి ఒక్కరూ సహజ యోగాను క్రమం తప్పకుండా ఆచరించి ఆనందకరమైన, ఆరోగ్యప్రదమైన జీవితాన్ని అనుభవించాలని సహజ యోగులు ధర్మసాయి, సుభాషిణి, రమేష్ పద్మావతి తెలిపారు. ఆదివారం నగరంలోని సహజ యోగ ధ్యాన మందిరం ప్రారంభ కార్యక్రమంలో మందిరం స్టేట్ కో ఆర్డినేటర్ కె. స్వామిబాబు, నేషనల్ ట్రస్ట్ మెంబర్ టి. మధుసూదన్‌రావు, ట్రస్ట్ వైస్ చైర్మన్ ఎం. రమేష్ పాల్గొని మందిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి మనిషి నిత్య జీవితంలో అనారోగ్య సమస్యలు దరి చేరకుండా ఉండాలంటే గంట పాటు సహజ యోగా తప్పని సరిగా చేయాలన్నారు. నేటి యాంత్రిక జీవనంలో సహజ యోగం మనిషి జీవన ప్రమాణాన్ని పెంపొందించేందుకు, ఒత్తిడిని జయించేందుకు ఉపయోగపడుతుందన్నారు. ప్రతి ఒక్కరూ నేటి ఆధునిక యుగంలో ఒత్తిళ్లకు గురవుతున్నారని, వాటిని జయించేందుకు సహజ యోగ ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మాతాజీ నిర్మలాదేవి, రమేష్, సోంబాబు, మధుసూదన్, ధర్మసాయి, కెప్టెన్ బాబూరావు, పలువురు సహజ యోగులు పాల్గొన్నారు.

భద్రం పార్కులో హనుమాన్ చాలీసా



హనుమాన్ చాలీసా పారాయణ చేస్తున్న భక్తులు

ఎంవీపీ కాలనీ: స్థానిక భద్రం పార్కులో పలువురు ఆధ్యాత్మిక వేత్తలు హనుమాన్ చాలీసా పారాయణ కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. భారతదేశ సనాతన ధర్మ రాజ్య స్థాపనలో భాగంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో సామవేదం షణ్ముఖ శర్మ మాట్లాడుతూ సనాతన ధర్మాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. హిందూ ధర్మ స్థాపనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు. అనంతరం 108 సార్లు హనుమాన్ చాలీసా యజ్ఞాన్ని నిర్వహించారు. చింతామని భజన బృందంతో పాటు కర్ణాటక సంగీత విద్వాంసులు గుమ్ములూరి శారదా సుబ్రహ్మణ్యం తదితరులు వేయి మంది భక్తులతో హనుమాన్ చాలీసా సహస్ర గళార్చన చేయించారు. ఈ కార్యక్రమంలో కందాళ వెంకట సత్యశ్యామ్, అరుణా దంపతులు పాల్గొన్నారు.

ఒకే వేదికపై ఆరు తరాలు



ఆఖరి కుమారుడు వరహాలశెట్టిని సత్కరిస్తున్న కుటుంబ సభ్యులు

పరవాడ: మానవ సంబంధాలు మంట కలిసిపోతున్న తరుణంలో ఆరు తరాలకు చెందిన కుటుంబ సభ్యులు ఒకే వేదికపై కలుసుకొని ఆత్మీయత అనురాగాలు పంచుకున్నారు. ఆ అపురూప ఘట్టం పరవాడ మండలం వాడచీపురుపల్లి గ్రామంలో ఆదివారం జరిగింది. వాడచీపురుపల్లి గ్రామానికి చెందిన దివంగత గుండా నాగరాజుకు చెందిన ఆరు తరాల వంశ వృక్షం ఒకే వేదికపై కలుసుకోవడంతో గ్రామంలో సందడి నెలకొంది. వైశ్య కుటుంబానికి చెందిన దివంగత గుండా నాగరాజుకు ఏడుగురు కుమారులు, కుమార్తెలు కాగా వారి ద్వారా వృద్ధి చెందిన కుమారులు, కూతుళ్లు, అల్లుళ్లు, కోడళ్లు, మనవలు, మునిమనవలంతా ఆదివారం గ్రామంలో ×గుండా నాగరాజు గారి కుటుంబ సమ్మేళనం¥ం నిర్వహించారు. సుమారు 345 మంది సభ్యులు కలుసుకొని ఆత్మీయత అనుబంధాలను గుర్తు చేశారు. దివంగత గుండా నాగరాజుకు గుండా నరసింహమూర్తి, రాంబాబు, మాణిక్యలరావు, బాపారావు, సత్యనారాయణమూర్తి, వరహాలశెట్టి, కె.సరోజిని సంతానం. వీరిలో ఆఖరి కుమారుడు గుండా వరహాలశెట్టి మాత్రమే ఉన్నారు. తద్వారా ఏర్పడిన వంశవృక్షమే వీరంతా. కొందరు డాక్టర్లు, సాఫ్ట్‌వేర్ రంగాల్లో స్థిరపడ్డారు. వేర్వేరు ప్రాంతాల్లో స్థిరపడ్డ వీరంతా ఓ చోట చేరి తమ ఆత్మీయత అనురాగాలను నెమరువేసుకొన్నారు. యువత ఉత్సాహంగా డ్యాన్సులు చేసి సందడి చేశారు. అన్నా తమ్ములు, అక్కా చెల్లెళ్ల మధ్య సన్నగిల్లుతున్న ఆత్మీయత అనురాగాలను నేటి సమాజానికి గుర్తు చేయాలన్న ఉద్దేశంతో ఈ ఆత్మీయ కలయిక ఏర్పాటు చేశామని గుండా వరహాల శెట్టి చెప్పారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ మాసవరపు అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా విద్యుత్ వైర్లు



ప్రమాదకరంగా వేలాడుతున్న యాంగ్లర్

పరవాడ: ముత్యాలమ్మపాలెం, దిబ్బపాలెం గ్రామాల పరిధిలో ఏర్పాటు చేసిన విద్యుత్ స్తంభాలు, వైర్లు, కేశారాలు, యాంగర్లు తుప్పుపట్టి ప్రమాదకరంగా ఉన్నాయని ఆయా గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. తీర ప్రాంత సమీప గ్రామాలు కావడంతో ఉప్పు గాలికి విద్యుత్ స్తంభాలు, వైర్లు తరచూ తుప్పు పట్టి పాడవుతున్నాయి. వైర్లు తెగిపడుతున్నాయి. కే సారాలు పగిలిపోతుండడంతో విద్యుత్ సరఫరాలో నిత్యం ఇబ్బందులు తలెత్తుతున్నాయి. వైర్లు తెగిపోతుండడంతో ఎప్పుడు ఎలాంటి ముప్పు సంభవిస్తోందనని ప్రజలు భయాందోళన చెందుతున్నారు. ముత్యాలమ్మపాలెం కూడలి నుంచి తీరం వరకు ఏర్పాటు చేసిన విద్యుత్ వైర్లు ప్రమాదకరంగా ఉన్నాయి. అలాగే అనేక చోట్ల విద్యుత్ వైర్లు లూజుగా ఉండడం వల్ల గాలికి వేలాడుతూ తెగిపోవడానికి సిద్ధంగా ఉన్నాయని మత్స్యకారులు చెప్పారు.మరో వైపు లోవోల్టేజీ సమస్య కారణంగా ఫ్రిజ్‌లు, టీవీలు కాలిపోతున్నాయని వాపోతున్నారు. సమస్యను విద్యుత్ శాఖ అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా ప్రయోజనం కనిపించలేదని గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు అరిజిల్లి మసేను ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి అస్తవ్యస్తంగా ఉన్న విద్యుత్ వ్యవస్థను సరిచేసి లోవోల్టేజీ సమస్యను పరిష్కరించాలని గంగపుత్రులు కోరుతున్నారు.

'ఉపేంద్ర బీఫార్మసీ' రెండో షెడ్యూల్ ప్రారంభం



మీడియాతో మాట్లాడుతున్న నిర్మాత అచ్యుతరావు

బీచ్‌రోడ్డు: ఎస్ఎస్ఎల్ క్రియేషన్స్ బ్యానర్‌పై నిర్మిస్తున్న ఉపేంద్ర బీ ఫార్మసీ సినిమా రెండో షెడ్యూల్ వీఎంఆర్‌డీఏ పార్కులో ఆదివారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా సినీ నిర్మాత డాక్టర్ కంచర్ల అచ్యుతరావు మాట్లాడుతూ మంచి కథతో ఈ చిత్రం తీస్తున్నామన్నారు. ఇప్పటికే విడుదల చేసిన టీజర్‌కు ప్రేక్షకుల నుంచి మంచి స్పందన లభిస్తుందన్నారు. చిత్రం హీరో ఉపేంద్రబాబు జన్మదినం అక్టోబర్ 29న చిత్రాన్ని విడుదల చేస్తామన్నారు. డైరెక్టర్ సాయి కుమార్ గుంటురెడ్డి మాట్లాడుతూ సమాజానికి ఉపయోగపడే చిత్రాలను తెరకెక్కిస్తునామన్నారు. ఈ కార్యక్రమంలో హీరోయిన్ ప్రియ, తానా సంఘం ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

అలరించిన అష్టావధానం



శతావధానం చేస్తున్న తాతా సందీప్ శర్మ

ఏయూ క్యాంపస్: తెలుగు భాష వైభవాన్ని చాటేలా అష్టావధానం కార్యక్రమం ఆదివారం ఆంధ్ర విశ్వవిద్యాలయం వైవీఎస్ మూర్తి ఆడిటోరియం వేదికగా జరిగింది. శ్రీవిశ్వనాథ సాహిత్య పీఠం, శ్రీ కొప్పరపు కవుల కళాపీఠం సంయుక్తంగా నిర్వహించిన అష్టావధానంలో ఆంధ్ర విశ్వవిద్యాలయం పరిశోధక విద్యార్థి శతావధాన శరచ్చంద్ర తాతా సందీప్ శర్మ అవధానం ఆకట్టుకుంది. సభకు ఏయూ ఇంజినీరింగ్ కళాశాల పూర్వ ప్రిన్సిపాల్ ఆచార్య పి.ఎస్.అవధాని అధ్యక్షత వహించారు. అవధాన పృశ్ఛకులుగా డాక్టర్ డి.వి.సూర్యారావు, భైవరపట్ల ఆదిత్య, పేరాల హరిప్రియ, రాళ్లపల్లి విద్యాసాగర్, సి.వి.ఆర్.మూర్తి, శేఖర మంత్రి ప్రభాకర్, భాగవతుల ఆరుద్ర మయుఖ్, రాంభట్ల నృశింహ శర్మలు వ్యవహరించారు. అనంతరం విశ్వనాథ సాహితీ పురస్కారాన్ని ఆచార్య బేతవోలు రామబ్రహ్మంకు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో సాహితీ వేత్త డాక్టర్ పేరి రవికుమార్, డాక్టర్ ఎస్. విజయ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా 'నే...నే...నీతోనే ఉంటా' ప్రీ రిలీజ్ వేడుక



ప్రీ రిలీజ్ వేడుకల్లో పోస్టర్ ఆవిష్కరిస్తున్న దాడి సత్యనారాయణ తదితరులు

సింధియా: జీవీఎంసీ 40వ వార్డు షిప్‌యార్డ్‌కాలనీలోని బాలకృష్ణ కల్యాణ మండపంలో ఆదివారం సాయంత్రం నే...నే...నీతోనే ఉంటా ప్రీ రిలీజ్ వేడుకను ఘనంగా నిర్వహించారు. శ్రీ విజయ కల్యాణ్ క్రియేషన్స్ బ్యానర్‌పై శ్రీనివాస్ కల్యాణ్, చైతన్య హీరోహీరోయిన్లుగా నటిస్తున్న ఈ సినిమా ప్రీ రిలీజ్ వేడుకకు మాజీ డిప్యూటీ మేయర్, ఏపీ మా అసోసియేషన్ ప్రెసిడెంట్ దాడి సత్యనారాయణ హాజరై చిత్ర యూనిట్‌ను అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డైరెక్టర్ కమ్ హీరో శ్రీనివాస్ కళ్యాణ్ పర్యవేక్షణలో మొదటి చిత్రంగా తెరకెక్కుతున్న నే...నే...నీతోనే ఉంటా విజయవంతం కావాలని ఆకాంక్షించారు. శ్రీ విజయ కళ్యాణ్ క్రియేషన్స్ బ్యానర్‌పై మరెన్నో మంచి చిత్రాలు తెరకెక్కాలని, మరెందరికో ఉపాధి లభించాలని ఆకాంక్షించారు.